


కాశీ మజిలీ కథలు 70

**జరిగిన కథ :** ఆబాలగోపాలాన్నీ అలరించిన కాశీమజిలీ కథలను.. 1930వ దశకంలో మధిర సుబ్బన్న దీక్షితులు రచించారు. మణిసిద్ధుడనే యతి కాలినడకన కాశీయాత్ర చేస్తూ.. తన వద్దనున్న మణి సహాయంతో, దారిమధ్యలో అనేక దేశాల విశేషాలు తెలుసుకుని.. గోపాలకుడితో చెప్పిన కథలే ఈ కాశీమజిలీలు. 12 సంపుటాలుగా వచ్చిన ఈ కథల్లో.. ప్రస్తుతం మీరు చదవబోతున్నది 10వ భాగంలోని కథ.

# పాతాళ గుహ

అనుసృజన:
నేతి సూర్యనారాయణ శర్మ

కన్యాకుబ్జాన్ని తాళధ్వజుడు అనే రాజు పాలిస్తున్నాడు. అతనికి అనేకమంది కుమారులు ఉన్నారు. వారిలో పెద్దవాడి పేరు వీరవర్మ. రెండోవాడు సుధన్వుడు. పదహారేళ్ల వయసువాడైన వీరవర్మ.. ఒకనాడు తమ్ముడితో కలిసి తండ్రిని చూడటానికి వచ్చాడు.

''తండ్రీ! నేనిప్పుడు ధనుర్వేదమంతా చదివాను. దాని ఫలం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి దిగ్విజయ యాత్ర చేయాలని అభిలాష కలిగింది. అందుకు మీ అనుమతి కోరుతున్నాను'' అని అడిగాడు.

కుమారుని కోరిక విని, వారి తల్లి తల్లడిల్లింది.

''కుమారా! యువరాజుగా పట్టభద్రుడివై ఇంటి వద్దనే సుఖంగా ఉండకుండా.. ఇలా అందరితోనూ కయ్యానికి కాలుదువ్వడం ఎందుకు? దిగ్విజయ యాత్ర అంటే మాటలా!? మహాశూరులతో పోరు చేయాల్సి వస్తుంది. శత్రువులకు జాలి ఉండదు. అయినా జయాపజయాలు దైవాయత్తాలు! బాబూ! యుద్ధానికి పోవద్దు'' అని నచ్చజెప్పబోయింది.

కానీ, తాళధ్వజుడు కానీ, వీరవర్మ కానీ ఆమె మాటలను అంగీకరించలేదు.

''రేపటి రోజున రాజు కాదగినవాడు ముందుగానే తన వీరపరాక్రమాలను లోకానికి తేటతెల్లం చేయడం అవసరం. దిగ్విజయ యాత్ర తప్పకుండా చేయాల్సిందే! నీకు ఆరునెలలు సమయం ఇస్తున్నాను. నీతో కూడా నీ పెద్ద తమ్ముడైన సుధన్వుడిని తీసుకుని వెళ్లు. చతురంగ బలాలతో తరలి వెళ్లండి. తూర్పుదిక్కున నీ కీర్తిపతాకను ఎగురవేసి రా.. జయోస్తు!'' అన్నాడు రాజు.

వీరవర్మ, సుధన్వుడు తల్లిదండ్రులకు నమస్కరించి బయల్దేరారు. తూర్పుదిక్కున ఉన్న అంగ వంగ కళింగ రాజ్యాలలో చొరబడి.. ఆయా పాలకులను శరణాగతులను చేసుకున్నారు. తమ సార్వభౌమత్వాన్ని వారిచేత అంగీకరింప చేశారు. తండ్రి విధించిన గడువు సమీపిస్తుండటంతో ఇద్దరూ ఇంటిముఖం పట్టారు.

సేనలతో కలిసి వస్తూ ఒక అరణ్యం మధ్యలో విడిది చేశారు. అది ఒక రుషిగారి తపోవనం. ఆ సంగతి తెలియని సేనావాహిని.. అది మామూలు అరణ్యమే అనుకుని, చెట్లకొమ్మలను విరిచేస్తూ.. పూలు – పళ్లను రాల్చేస్తూ.. అంతా చిందరవందర చేసేశారు.

అంతలో అక్కడికి ఒక మునికుమారుడు వచ్చి, వారిపై ఆగ్రహావేశాలు ప్రదర్శించ సాగాడు.

వీరవర్మ అతనికి నమస్కారం చేసి..

''స్వామీ! ఇది మీ తపోవనమని తెలియక ఇక్కడ విడిది చేశాం. మీరు శాపానుగ్రహ సమర్థులు. మమ్మల్ని క్షమించండి'' అని వేడుకున్నాడు.

అప్పుడు శాంతించిన మునికుమారుడు..